

రబీ సాగునీటికి ఇబ్బంది లేదు

గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

గోదావరి డెల్టా సిస్టమ్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో రబీ పంట కాలానికి సాగునీటికి ఎటువంటి ఇబ్బందీ లేదని గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నదిలో నీటి లభ్యత ప్రస్తుతం సమృద్ధిగా ఉందని పేర్కొన్నారు. గోదావరి జిల్లాల పరిధిలో సాగు, తాగునీటికి ఏదైనా ఇబ్బంది ఏర్పడితే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, ఏలూరు ఫోన్ నెంబర్ 9701375830, చీఫ్ ఇంజినీర్ గోదావరి డెల్టా సిస్టమ్ ధవళేశ్వరం ఫోన్: 9652536333లను సంప్రదించాలని సతీష్ కుమార్ సూచించారు.

గురువులు గగ్గోలు..!

ఒకపక్క పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు.. మరోపక్క ఎన్నికల కమిషన్ హుకుంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలు ఉపాధ్యాయుల మెడపై కత్తిలా మారింది. విద్యార్థులకు అందిస్తున్న చిక్కీలపై జగన్ ఫొటోతో ముద్రించిన కవర్‌ను తొలగించడంతోపాటు పుస్తకాలపై ఉన్న జగన్ ఫొటోలు కన్పించకుండా అట్టలు వేయించాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. చివరకు విద్యార్థులు బెల్టు ధరించకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. దీంతో ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

- ఎన్నికల కోడ్ అమలులో ఉపాధ్యాయుల మెడపై కత్తి
- చిక్కీలపై జగనన్న కవర్ తొలగింపుతోపాటు పుస్తకాలకు అట్టలేయించే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆదేశం
- విద్యార్థులు బెల్టులు సైతం పెట్టుకోకుండా చర్యలు చేపట్టాలని హుకుం
- ఆందోళనలో ఉపాధ్యాయులు



ప్రజాశక్తి - భీమవరం

విద్యారంగంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి చేపట్టిన చర్యల్లో ఎక్కువ ప్రభుత్వ ప్రచారానికి వినియోగించుకుంది. అదే ఇప్పుడు ఉపాధ్యాయులకు గుదిబండగా మారింది. విద్యార్థులకు అందించే చిక్కీలు, చదువుకునే పుస్తకాలు, ట్యాబ్‌లు, స్కూల్ బ్యాగ్‌లు, బెల్టులు వంటి వాటిపై సిఎం జగన్ ఫొటో ముద్రించి అందించారు. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రావడం, కోడ్ అమలులోకి రావడం చకచకా జరిగిపోయాయి. జిల్లా అధికార యంత్రాంగం కోడ్ అమలుపై పటిష్టమైన చర్యలు చేపట్టింది. వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు, రాజకీయ నేతల విగ్రహాలకు, ప్రభుత్వ శిలాఫలకాలకు ముసుగులు వేయడం వంటి చర్యలను ముమ్మరం చేసింది. అయితే విద్యార్థులకు అందిస్తున్న చిక్కీలు, అందించిన విద్యా సామగ్రిపై సర్వత్రా చర్చ జరుగుతున్న నేపథ్యంలో విద్యా సామగ్రిపై ఉన్న జగన్ ఫొటోను తొలగించాలని పాఠశాల విద్యాశాఖకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలు ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారాయి. విద్యార్థులకు ఇచ్చిన బెల్టు, బ్యాగులపై 'జగనన్న విద్యాకానుక' అని రాశారు. దీంతో ఆ బెల్టులు ధరించకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై పడింది. బ్యాగులపైనా ఇదే విధంగా ఉందని, వీటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తెలియడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా ఇస్తున్న చిక్కీలపై ఉండే కవర్లపైనా సిఎం జగన్ ఫొటోను ముద్రించారు. ఇప్పటికే చాలా పాఠశాలలకు వీటిని పంపిణీ చేశారు. పాఠశాలల్లో చిక్కీల నిల్వలు 15 రోజుల వరకు ఉంటున్నాయి. పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లపైనా 'జగనన్న గోరు ముద్ద' అని స్టాంపులు వేశారు. ఇప్పుడు ఇవి పాఠశాలల్లోనే ఉన్నాయి. ఎన్నికల కోడ్ రావడంతో వీటిని ఏం చేయాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. బైజూస్ కంటెంట్‌తో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లపైనా జగన్ ఫొటో ముద్రించారు. వీటిపై వేసిన స్టిక్కర్లనూ తొలగించడం లేదు. ఉపాధ్యాయులు వీటిని తొలగించాలా లేదా అనే దానిపై స్పష్టత లేకుండాపోయింది. పాఠశాలల్లో గోడలపై జగనన్న గోరుముద్ద, విద్యాకానుక ఇతరత్రా ఇలాంటి కార్యక్రమాలు, జగన్ ఫొటోలను చాలాచోట్ల పెయింటింగ్ వేశారు. ఇప్పుడు వీటిని మార్చేందుకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. విద్యార్థులకు అందించిన డిక్షనరీలపైనా జగన్ బొమ్మతో నవరత్నాల వివరాలు ముద్రించారు.

ఎన్నికల కమిషన్ ఆదేశం.. ఉపాధ్యాయులు సతమతం

చిక్కీలపై ఉన్న జగన్ ఫొటోతో కూడిన కవర్‌ను తీసేసి చిక్కీలు అందించాలని ఆదేశించారు. చిక్కీల కవర్ తీసేస్తే వాటిని ఎలా నిల్వ చేయాలో అర్థం కాక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. కవర్ తీసేశాక ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం లేదని, బంక కారిపోతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పైగా పుస్తకాలకు అట్టలు వేయించాలని, బెల్టులు ధరించకుండా చూడాలని ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పని భారంతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు ఈ పనులు మరింత భారంగా మారాయి. దీనికి తోడు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎటువంటి చర్యలు తీసుకుంటే ఏ పరిస్థితి ఎదురవుతుందోనని భయాందోళనకు ఉగురవుతున్నారు.

పని ఒత్తిడితో ఉపాధ్యాయులు సతమతం

బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి



ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించడం అభినందనీయం. కోడ్ ఉల్లంఘన లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. చిక్కీలపై ఉన్న సిఎం జగన్ ఫొటోతో కూడిన కవర్ తొలగించాలని, పుస్తకాలకు అట్టలు వేయించాలని ఉపాధ్యాయులపై పెట్టిన బాధ్యత గురించి పునరాలోచించాలి. ఉపాధ్యాయులు ఇప్పటికే పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఓపక్క పరీక్షలు, మరోపక్క ఎన్నికల సమయంలో మరింత భారాన్ని మోపడం సరైంది కాదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన పేరిట తీసుకునే చర్యలకు ఎక్కడ గురవుతామోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

చిక్కీలపై కవర్లు లేకుండా సరఫరా చేయాలి

కెవి.రామచంద్రరావు, ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు



చిక్కీలపై ఉన్న సిఎం జగన్ ఫొటోతో కూడిన కవర్లు తొలగించి అందించాలని, విద్యార్థులు బెల్టులు ధరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. చిక్కీలపై జగన్ ఫొటోతో కూడిన కవర్ లేకుండా ఏజెన్సీ సరఫరా చేస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదు. విద్యార్థులు బెల్టులు ధరించకుండా చర్యలు చేపట్టాం. పాఠశాలల్లో ప్రభుత్వ ప్రచారాలకు సంబంధించిన వాటిని అన్ని విఆర్ఒ సమక్షంలో తొలగించాం. ఎన్నికల కమిషన్ ఆదేశాలు తూచ తప్పకుండా పాటిస్తున్నాం.

పోలీస్ శాఖ రూటే వేరు..!

- 'పది' పరీక్షల బందోబస్తు విధుల్లో మహిళా పోలీసులు
- డిజిపి ఆదేశాలు రెండు జిల్లాల్లోని అధికారులు బేఖాతరు
- ఎన్నికల విధులు కేటాయించేందుకు ముందస్తు ఎత్తుగడా అంటూ చర్చ
- డ్యూటీ పాస్ లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద మహిళా పోలీసులు



ఏలూరుపాడులో పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ చట్టాలను అమలు చేయడం, కోర్టు ఆదేశాలను తుచా తప్పకుండా పాటిస్తూ ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన పోలీస్ శాఖ తన రూటే సెపరేటుగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పోలీస్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. మహిళా పోలీసుల విధులకు సంబంధించి కోర్టులో ప్రభుత్వం వేసిన అఫిడవిట్‌ను పట్టించుకోకుండా, రాష్ట్ర డిజిపి ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ సచివాలయ ఉద్యోగులైన మహిళా సంరక్షణ కార్యదర్శులకు (మహిళా పోలీసులకు) 'పది' పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు కేటాయించడం గమనార్హం. ఈ నెల 18వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లాలో 139, పశ్చిమగోదావరి జిల్లాలో 127 కేంద్రాల్లో 'పది' పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులను బందోబస్తుగా నియమిస్తారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 'పది' పరీక్షా కేంద్రాల వద్ద మహిళా పోలీసులు విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. ఉంగుటూరు నియోజకవర్గంలో గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, కాళ్ల మండలం ఏలూరుపాడు, పాలకొల్లు మండలం ఇలా దాదాపుగా అత్యధిక కేంద్రాల వద్ద మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రెండు గంటల వరకూ పరీక్షా కేంద్రాల వద్ద విధులు, తర్వాత సచివాలయంలో విధులు నిర్వహించాల్సి రావడంతో మహిళా పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా పోలీసులకు 'పది' పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు విధులు కేటాయించడం నిబంధనలకు పూర్తి విరుద్ధం. అయినప్పటికీ జిల్లాలోని పోలీసు అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా చట్టాలతో పని లేకుండా తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తూ మహిళా పోలీసులపై జులుం ప్రదర్శిస్తున్న పరిస్థితి ఉంది. ఇది జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాలతో జరిగిందా.. లేక కిందిస్థాయిలో సిఐ, ఎస్ఐలే అత్యుత్సాహంతో మహిళా పోలీసులకు విధులు కేటాయించారా అనేది తెలియరావాల్సి ఉంది.



Rc.No.16/C3/MP/2023

Office of the
Director General of Police,
A.P., Mangalagiri.

Date: 21.07.2023.

MEMO

Sub:-AP Police – Mahila Police – Certain instructions - Regarding.

*****

Mahila Police is a functionary in Village/Ward Secretariat to address the issues pertaining to Safety of Women and Children in convergence with other line departments. They are not meant for maintenance of Law & Order and other regular Police functions like bandobust duties, receptionists etc. Further, needless to mention that their job chart does not involve frequent visits to the jurisdiction police station.

All the unit officers are therefore instructed not to deploy them for the above duties at any cost. Any deviation in this regard will be viewed seriously and the erred officers will be dealt with disciplinary action.

The Range IsG/DIsG are requested to monitor closely and ensure compliance.

Director General of Police

2023 జులై 21న మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించొద్దంటూ డిజిపి జిల్లా పోలీస్ అధికారులకు పంపిన ఉత్తర్వుల కాపీ

డిజిపి ఆదేశాలే పట్టించుకోరా..!

వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో 11 రకాల పోస్టులకు సంబంధించి ఉద్యోగులను నియమించింది. అందులో మహిళా సంరక్షణ కార్యదర్శులు (మహిళా పోలీసులు) ఒకభాగం. తొలుత శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరు పని చేయాలని తెలిపారు. తర్వాత పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పనిచేసేలా మార్పుచేసి పోలీస్ విధులు కేటాయించడం ప్రారంభించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులకు పోలీసు ఉద్యోగుల తరహాలో బందోబస్తు విధులతోపాటు, పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ విధులు అనేకం వేసేవారు. దీనిపై కొంతమంది ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు తప్పుబట్టడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించబోమంటూ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. వెంటనే మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించొద్దంటూ, నిబంధనలు అతిక్రమించిన పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తప్పవని 2023 జులై 21న జిల్లా ఎస్‌పిలు అందరికీ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెలువడిన తర్వాత రోజు జిల్లా ఎస్‌పిలు సైతం డిఎస్‌పి, సిఐ, ఎస్ఐలకు మహిళా పోలీసులకు విధులు కేటాయించొద్దని, ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తప్పవంటూ ఆదేశాలిచ్చారు. అప్పటి నుంచి మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించడం నిలిచింది. మళ్లీ నిబంధనలను అతిక్రమిస్తూ రెండు జిల్లాల్లోని పోలీస్ అధికారులు మహిళా పోలీసులకు బందోబస్తు విధులు కేటాయిస్తున్నారు. అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా కొన్నిచోట్ల మహిళా పోలీసులను బందోబస్తుకు ఉపయోగించారు. ఎవరూ మాట్లాడకపోవడంతో ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పలుచోట్ల విధులు కేటాయించారు. ఇప్పుడు దాదాపు అన్ని పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు విధులు కేటాయించారు. ఎక్కడైనా మహిళా పోలీసులు ప్రశ్నిస్తే ఎంపిడిఒల ద్వారా ఒత్తిడి తెచ్చి మరీ విధులు కేటాయించడమే కాకుండా, మహిళా పోలీస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించడంపై రెండు జిల్లాల పోలీస్ అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

నిబంధనలను అతిక్రమిస్తున్న విద్యాశాఖ అధికారులు..

'పది' పరీక్షా కేంద్రాల వద్ద విధులు కేటాయించిన ప్రతిశాఖకు సంబంధించిన సిబ్బంది నుంచి డ్యూటీ ఆర్డర్‌తోపాటు, అటెండెన్స్‌ను పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న విద్యాశాఖాధికారి తీసుకోవాలి. మహిళా పోలీసుల విధులకు సంబంధించి అధికారికంగా డ్యూటీ ఆర్డర్ ఇవ్వడం లేదని తెలిసింది. డ్యూటీ ఆర్డర్ లేని మహిళా పోలీసులను ఏవిధంగా విధులకు అనుమతిస్తున్నారో విద్యాశాఖ అధికారులు చెప్పాల్సి ఉంది. విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసుల వద్ద అటెండెన్స్ తీసుకుంటున్నారో లేదో కూడా చెప్పాలి. నిబంధనలను అతిక్రమిస్తున్న విద్యాశాఖ అధికారులు సైతం దోషులుగా నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడనుందనే చర్చ నడుస్తోంది.

'పది' పరీక్షలకు 20,455 మంది హాజరు

1007 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పదో తరగతి పరీక్షలు రెండో రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. హిందీ పరీక్షకు 21,462 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 20,455 మంది హాజరయ్యారు. 1007 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 95.31 శాతం హాజరు నమోదైంది. ఎస్ఎస్‌సి (ఎపిఒఎస్ఎస్) పబ్లిక్ హిందీ పరీక్షకు 83 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 90.36 శాతం హాజరు నమోదైంది. ఇంటర్మీడియట్ (ఎపిఒఎస్‌ఎస్) బయోలాజికల్ సైన్స్, కామర్స్ పరీక్షకు 690 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా సుమారు 629 మంది విద్యార్థులు హాజరయ్యారు. సుమారు 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 91.16 శాతం హాజరు నమోదైంది. జిల్లావ్యాప్తంగా 74 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. సుమారు 50 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 11 పరీక్షా కేంద్రాలను జిల్లాస్థాయి పరిశీలకులు, ఆరు పరీక్షా కేంద్రాలను డిఇఒ వెంకటరమణ, మరో ఏడు పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ పరిశీలించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డిఇఒ తెలిపారు.

నరసాపురం : పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యా శాఖాధికారి పి.పుష్పరాజ్యం తెలిపారు. మంగళవారం తొమ్మిది సెంటర్లలో జరిగిన హిందీ పరీక్షకు మొత్తం 1801 మందికి 1734 మంది హాజరయ్యారని తెలిపారు. 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉండి : మంగళవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలోని ఉండి ఎ, ఉండి బి, ఎన్ఆర్‌పి అగ్రహారం, ఉప్పులూరు పరీక్షా కేంద్రాల్లో 613 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 568 మంది హాజరయ్యారని, 45 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఇఒ బి.జ్యోతి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులు ఏదైనా అస్వస్థతకు గురైతే చికిత్స అందించేందుకు ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది అందుబాటులోనే ఉన్నట్లు వారు తెలిపారు.

మొగల్తూరు : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా రెండో రోజు హిందీ పరీక్ష ఆరు కేంద్రాల్లో మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ యు.శ్యామ్యూల్ జాన్ తెలిపారు. పరీక్షలకు 879 మంది విద్యార్థులకు గాను 829 మంది హాజరయ్యారని తెలిపారు. 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

ఆచంట: పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం రెండో రోజు మండలంలో ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, ఆచంట వేమవరం, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో 2వ రోజు విద్యార్థులు హిందీ పరీక్ష రాశారు. హిందీ పరీక్షకు 540 మందికి గాను 527 మంది విద్యార్థులు హాజరయ్యారు. మరో 13 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ ఎ.ఉషారాణి తెలిపారు.

కంట్రోల్ రూమ్ సమర్థవంతంగా పని చేయాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నివేదికల సమర్పణ, సి.విజిల్, సువిధ యాప్, కంట్రోల్ రూమ్ నిర్వహణ తదితర అంశాలపై కలెక్టరు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, వ్యయ ఉల్లంఘనలు తదితర అంశాలు సి.విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదుపై తక్షణం స్పందించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్‌కు రోజువారీ నివేదికలు సకాలంలో సమర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్‌మాథుర్, సంబంధిత జిల్లా అధికారులు, ఎన్నికల సూపరింటెండ్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, డిప్యూటీ తహశీల్దార్లు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

మొదటి అడుగు సరిగ్గా వేయాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్వ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్

ప్రజాశక్తి - తణుకురూరల్

మొదటి అడుగు సరిగ్గా వేస్తే మిగిలిన అడుగులు తప్పటడుగులు కావని రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్వ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఆడిటోరియంలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ, ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పీజీ (అటానమస్) సంయుక్తంగా 'స్వేచ్ఛాయుత ఎన్నికలు-పౌర సమాజం' పాత్ర అనే అంశంపై కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. తొలుత కళాశాల వ్యవస్థాపకులు చిట్టూరి సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ 1950 జనవరి 26న రెండు చక్రాలతో ఒక రథాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తయారు చేయగా, ఆ రథానికి సారథులు మంచివారై కుల, మతరహితంగా అందరినీ అభివృద్ధి వైపు తీసుకెళ్లేవారి ఉండాలని తెలిపారు. ప్రపంచంలో విప్లవం ఎక్కడ నుండో రాదని ఒక వ్యక్తిలో వచ్చిన ఆలోచన ద్వారా వస్తుందని జిడ్డు కృష్ణమూర్తి సందేశాన్ని విద్యార్థినులకు తెలియజేశారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ మేధావులు మేల్కొని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కును అందరూ ఉపయోగించుకోవాలన్నారు. దారిదీపం ఎడిటర్ డివివిఎస్.వర్మ మాట్లాడుతూ ఏ ప్రభుత్వానికీ లొంగకుండా రాజ్యాంగానికి అనుగుణంగా విధులు నిర్వహించిన వ్యక్తి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అని అన్నారు. రాజ్యాంగంలో ప్రజలు తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారానే తెలియజేయగలమన్నారు. ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ మధ్య వయస్సు వారు మన రాష్ట్రంలో 29 శాతం ఉన్నారని, వారు వాళ్ల భవిష్యత్తు, వారి బిడ్డల భవిష్యత్తు కోసం నేడు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రలోభాలకు లొంగకుండా ప్రజల కోసం పని చేసే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్

ఆర్ఒ కార్యాలయం తహశీల్దార్ కార్యాలయంలోకి మార్చండి

పాలకొల్లు : పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని తహశీల్దార్ కార్యాలయంలోకి మార్చాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు కోరారు. ఈ మేరకు ఆయన రిటర్నింగ్ అధికారి శివకుమార్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. గతంలో తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ తదితర ప్రక్రియ ఉండేదని, అయితే ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఒ కార్యాలయం ఉండటం వల్ల పెద్ద గోపురం నుంచి యడ్ల బజార్ వరకు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఒ కార్యాలయం ఉండటం వల్ల మెయిన్ రోడ్‌లో వివిధ శాఖల అధికారుల కారులు నిలుపుతున్నారని, వెంటనే ఆర్ఒ కార్యాలయాన్ని తహశీల్దార్ కార్యాలయంలోకి మార్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నర్సింహారావు, సభ్యులు వట్టం గణేష్, కె.సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

24 గంటలు సమర్థవంతంగా పని చేయాలి - జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య ఆదేశించారు. చెక్‌పోస్టులు 24 గంటలు సమర్థవంతంగా పని చేయాలని అధికారులకు సూచించారు. మంగళవారం లోసరి జాతీయ రహదారి దగ్గరలో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నగదు, మద్యం, మాదక ద్రవ్యాలను వాహనాల్లో తరలించకుండా కట్టడి చేయాలన్నారు. చెక్‌పోస్టు వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసులను ఆదేశించారు.



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న జెసి ప్రవీణ్ ఆదిత్య

ఆర్‌డిఒ కార్యాలయంలోనే నామినేషన్లు స్వీకరణ

ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు

భీమవరం రూరల్: స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలోనే నామినేషన్లు స్వీకరిస్తామని, ఏప్రిల్ 25వ తేదీ సాయంత్రం మూడు గంటల వరకూ నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుందని ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు అన్నారు. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్లు వేసేటప్పుడు అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. జూన్ ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంటుందన్నారు. ర్యాలీలు, సభలు నిర్వహించుకోవాలంటే 48 గంటల ముందుగానే అనుమతి తీసుకోవాలని, ఆన్‌లైన్ ద్వారా కూడా అనుమతులు పొందవచ్చునని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ర్యాలీలు నిర్వహించుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఎటువంటి ఆధారాలు లేకుండా నగదు లభ్యమైతే చర్యలు తీసుకుంటామని, సరైన పత్రాలు చూపిస్తే ఎటువంటి చర్యలూ ఉండవని అన్నారు. ఇఎస్ఎంఎస్ యాప్‌లో ఇటువంటి అన్ని సమాచారాలను పొదుపరుస్తున్నామన్నారు. ఎక్కడా వాలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనడం లేదని స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీ ఎలాగనేది త్వరలోనే చెబుతామని ఆర్‌డిఒ వెల్లడించారు.



యాప్ డెమో చూపిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు రాజు

వైఎన్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా సాయిబాబా

నరసాపురం:స్థానిక వైఎన్ కళాశాలలో గణిత శాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న జిఎస్ఎస్.సాయిబాబా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత ప్రిన్సిపల్ చింతలపాటి కనకారావు విదేశీ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినిమిల్లి సత్యనారాయణరావు సాయిబాబాకు మూడు నెలలపాటు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా చినిమిల్లి మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా కళాశాల అధ్యాపకుడిగా, విభాగాధిపతిగా పనిచేస్తూ అనేక కమిటీల్లో ప్రతిభావంతంగా తనవంతు బాధ్యతలను నెరవేర్చారని తెలిపారు. సాయిబాబా క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ తాను ఎదగడానికి, ఇక్కడ వరకు రావడానికి సత్యనారాయణ ఆశీస్సులని తెలిపారు. ఇంతటి బాధ్యతను అప్పగించిన ఆయన నమ్మకాన్ని నిలబెడతానని, కళాశాల మరింత అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల పీజీ డైరెక్టర్ ఎస్.చింతారావు, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, డీన్ గంధం శ్రీ రామకృష్ణ, ఎంబిఎ విభాగాధిపతి ఆర్.పార్థసారధి, బిఇడి ప్రిన్సిపల్ శాంతి, హెచ్‌ఓడిలు డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, అధ్యాపకులు సాయిబాబాకు అభినందనలు తెలిపారు.

వైసిపి కబ్జాలో కాంగ్రెస్ కార్యాలయం : బుజ్జి

నరసాపురం:అధికారాన్ని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వైసిపి కబ్జా చేసిందని కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ కానూరు బుజ్జి విమర్శించారు. మంగళవారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఆ భవనం కాంగ్రెస్ పార్టీకి చెందుతుందని న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. అయితే వైసిపి నాయకులు మాత్రం దౌర్జన్యంగా భవనం పేరు మార్చి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. దీనిపై పార్టీ పోరాటం చేస్తుందన్నారు. నియోజకవర్గంలో పార్టీ ఎవరికి టిక్కెట్ కేటాయించలేదని ఆయన స్పష్టం చేశారు. అన్ని రంగాలలో వెనకబడిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో కాంగ్రెస్ రావాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మిడి రవి శ్రీనివాస్, మల్లెపూడి శ్రీనివాస్, కృష్ణారావు, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్ నిర్వహించొద్దంటూ నోటీసులు

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెంలో 83 వారాలుగా ప్రతి మంగళవారమూ అన్నాక్యాంటీన్ నిరాటంకంగా నిర్వహించామని, అయితే 84వ వారం అన్నాక్యాంటీన్ జరిపేందుకు వీల్లేదని ఆర్‌డిఒ నోటీసులిచ్చారని టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి తెలిపారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ లేకుండా సప్లై వర్కర్ల ద్వారా అన్నదాన కార్యక్రమం చేస్తానని ఆర్‌డిఒను అడిగానని, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని సాధ్యం కాదని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలకు అసౌకర్యం కలిగినందుకు క్షమాపణ చెప్పుకుంటున్నానని బాబ్జి అన్నారు. ఎన్నికల అనంతరం అన్నా క్యాంటీన్ తిరిగి ప్రారంభిస్తామని బాబ్జి తెలిపారు.

రాజేష్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెం లోటస్ స్కూల్స్ అధినేత, జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ పుట్టినరోజు సందర్భంగా బొలిశెట్టి రాజేష్ యువసేన ఆధ్వర్యంలో మద్దాల నరసింహం, ఆర్థిక సౌజన్యంతో మంగళవారం తణుకు రోడ్డులోని బస్ షెల్టర్ వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు రామిశెట్టి సురేష్, జనసేన రీజనల్ కోఆర్డినేటర్ కసిరెడ్డి మధులత, ఎంద్రపాటి రాజు, రాష్ట్ర చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి గట్టు గోపీకృష్ణ పాల్గొన్నారు.

జనసేనకు ఆదరణ : నాయకర్

మొగల్తూరు: ప్రజల్లో జనసేనకు ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై మంగళవారం కాళీపట్నం పడమర గ్రామానికి చెందిన కమల్ కిషోర్, అనుచరులు సుమారు 50 మంది నాయకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి నాయకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, నిప్పులేటి తారక రామారావు, బందెల రవీంద్ర, పోలిశెట్టి సాంబ, కందులపాటి బాలాజీ, గ్రంధి నాని ఉన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి : రామరాజు

ప్రజాశక్తి – ఉండి

ఉండి నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న తనకు ఎంఎల్‌ఎగా మరోసారి అవకాశం కల్పించాలని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మంగళవారం మహదేవపట్నంలో గ్రామ అధ్యక్షులు వనిమా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఇంటింటికీ రాంబాబు టిడిపి తెలుగుదేశం, భవిష్యత్తుకు భరోసా కార్యక్రమాల్లో పాల్గొన్న మంతెన రామరాజు మాట్లాడారు. కూటమి అధికారం చేపడితే మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామికి రూ.13.37 లక్షల ఆదాయం

ప్రజాశక్తి – పాలకొల్లు

పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగింది. 90 రోజులకు గాను రూ.13,37,985 ఆదాయం వచ్చింది. 23 గ్రాముల 350 మిల్లీగ్రాముల బంగారం, 2 కేజీల 80 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ 10 నోట్లు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ధరకర్తల ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ ట్రస్టీలు పాల్గొన్నారు.

గొందిలో ముదునూరి ప్రచారం

ప్రజాశక్తి – నరసాపురం

అభివృద్ధే లక్ష్యంగా నరసాపురం నియోజకవర్గాన్ని తీర్చిద్దామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గొందిలో మంగళవారం వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలతో కలిసి నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ప్రసాద రాజు ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో తమ పార్టీకి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. నరసాపురం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరారు.

మొగల్తూరు : పాతపాడులో బుధవారం ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

గ్రామాల్లో బ్యానర్లు తొలగింపు

ప్రజాశక్తి – మొగల్తూరు

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాలు, గోడలపై అంటించిన పోస్టర్లు, బ్యానర్లు తొలగిస్తున్నారు. మంగళవారం కెపిపాలెంనార్త్‌లో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించడంతో పాటు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు కార్యదర్శి గంగన్న పర్యవేక్షణలో సిబ్బంది పనులు చేపట్టారు. గ్రామస్తుల నుంచి లేదా వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని తమ సిబ్బందికి ఆయన సూచించారు.

పివిఎల్ గెలుపునకు కృషి చేస్తాం

వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి – పాలకోడేరు

వైసిపి ఉండి నియోజకవర్గ అభ్యర్థి పివిఎల్ నరసింహరాజుకు అండగా ఉండి రాబోయే ఎన్నికల్లో ఆయన గెలుపునకు కృషి చేస్తామని వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ అన్నారు. పివిఎల్ నరసింహరాజు కార్యాలయంలో మంగళవారం కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ నరసింహరాజును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. అగ్రవర్ణ పేదలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలందరూ జగన్ అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు చీకటి పల్లి మంగరాజు, మాజీ సర్పంచి సిహెచ్ వివి పాపారావు, ఎం.సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

భద్రతా వైఫల్యాలపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి – నరసాపురం

చిలకలూరిపేటలో జరిగిన సభ భద్రతా వైఫల్యాలపై ఎలక్షన్ కమిషన్ దర్యాప్తు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం రాయపేటలోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనకు వస్తే ఆయనకు రక్షణ కల్పించలేని స్థితిలో రాష్ట్ర రక్షణ వ్యవస్థ ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కమిటీ కార్యదర్శి తాయారు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చల్లా పద్మావతి, బండి స్వర్ణలత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలినడక వంతెన..!

విరిగిపోయిన రెయిలింగ్ - పట్టించుకోని అధికారులు - గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి – ఆకివీడు


రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న వంతన

కొత్తచెరువు వెళ్లే మార్గంలోని కాలినడక వంతెన ప్రమాదకరంగా మారింది. మండలంలోని శివారు ప్రాంతం కొల్లేరు తీరరాజుల పేట శివారు కొత్తచెరువు గ్రామానికి వెళ్లే మార్గంలో పాత వయ్యేరుపై సుమారు రెండు దశాబ్దాల క్రితం కాలినడక వంతెన నిర్మించారు. ఈ వంతెన సుమారు నాలుగు అడుగుల వెడల్పు ఉంటుంది. ఈ వంతెన గుండా మోటార్ సైకిల్‌తో, నడకదారి చేయగలుగుతారు. కొత్తచెరువు గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన గ్రామీణ రాజులపేటకు మధ్యలో వెంకయ్య కాలువ కొల్లేటి కాలువైన ఓల్డ్ వయ్యేరు కాలువ ఉంది. కాలువ గట్టు నుంచి లోపలికి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం వెళితే పూర్తిగా దళితవాడ కొత్తచెరువు గ్రామం ఉంది. ఆయా గ్రామస్తులు ప్రధాన గ్రామానికి, ఇతర ప్రాంతాలకు, మండల కేంద్రానికి రావాలంటే కాలింగిగూడెం మీదుగా సుమారు రెండున్నర కిలోమీటర్ల పైబడి నడిచి రావాల్సి వచ్చేది. ఆ దశలో ఎన్నో విజ్ఞప్తుల మేరకు ఈ కాలినడక బ్రిడ్జిని నిర్మించారు. ఈ వంతెనకు నాలుగడుగుల ఎత్తులో ఎడాపెడా రైయిలింగ్ నిర్మించారు. ఇనుప గొట్టాలతో రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ గొట్టాలు ఎండకు ఎండి, వానకు తడిసి విరిగిపోయాయి. దీంతో ఈ వంతెన గుండా వెళ్లాలంటే వాహనదారులు, బాటసారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా అంతేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెయిలింగ్ పోయి సుమారు నాలుగు సంవత్సరాలైందని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తరచూ కాలువలో పడిపోతున్నారని తక్షణం పాలకులు, అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విఇసి జూనియర్ కళాశాల పేరు మార్పు

ప్రజాశక్తి – వీరవాసరం

వీరవాసరం విఇసి జూనియర్ కళాశాలను శ్రీ వర్ధినీడి సత్యనారాయణ అండ్ వీరవాసరం ఎడ్యుకేషనల్ కమిటీ ప్రభుత్వం జూనియర్ కళాశాలగా పేరు మార్పు చేస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు ఇచ్చినట్లు కళాశాల మాజీ ప్రెసిడెంట్ అండ్ కరస్పాండెంట్ వర్ధినీడి సత్యనారాయణ (బాబ్జి) తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ గతంలో ఈ కళాశాలను వీరవాసరం ఎడ్యుకేషనల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించేవారని, ఆ తరువాత కళాశాలను తన తండ్రి, అప్పటి ఎంఎల్‌ఎ వర్ధినీడి సత్యనారాయణకు బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలిపారు. ఆయన తరువాత ఈ కళాశాల నిర్వహణ బాధ్యతలను తాను తీసుకున్నానని తెలిపారు. అప్పటి నుంచి వీరవాసరం ఎడ్యుకేషన్ కమిటీ ఎయిడెడ్ జూనియర్ కళాశాలగా కొనసాగిందన్నారు. గత సంవత్సరం ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వం రద్దు చేయడంతో దీని నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాల పేరు మార్పు చేస్తూ ప్రభుత్వం జూనియర్ కళాశాలగా కొనసాగుతుందన్నారు. ఈ కళాశాలకు తన తండ్రి చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఆయన పేరును చేర్చడం జరిగిందని, ఇక నుండి ఈ కళాశాల వర్ధినీడి సత్యనారాయణ అండ్ వీరవాసరం ఎడ్యుకేషనల్ కమిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలగా పేరుపై కొనసాగుతుందని తెలిపారు. ఈ కళాశాలను గతంలో మాదిరిగా ఆదరించాలని కోరారు. ఈ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్‌ఇసితో పాటు ఒకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో మాజీ ప్రిన్సిపల్ బలరాం, అధ్యాపకులు ప్రభువరం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అండతోనే ఉన్నతస్థాయికి

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

ఆర్యవైశ్యుల అండదండలతోనే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మంగళవారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. వారి ఆహ్వానం మేరకు మంత్రి కొట్టు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో వ్యాపార రంగం నుంచి వచ్చిన తనకు ఆర్యవైశ్యులతో తరతరాల అనుబంధం ఉందన్నారు. తాను 30 సంవత్సరాలుగా రాజకీయాల్లో రాణించడానికి ఆర్యవైశ్యులు అండదండలే కారణమన్నారు. వారికి కొట్టు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఆర్యవైశ్యులు నిండు మనసుతో తనను మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఆర్యవైశ్య సామాజిక వర్గం అన్ని విధాలుగా అభివృద్ధి సాధించేందుకు తన తోడ్పాటు ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మాట్లాడారు. అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. సమావేశంలో తాడేపల్లిగూడెం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్లేపర రాము, కార్యదర్శి నున్న బాలత్రిపుర సుందర్రావు, కోశాధికారి భోగవిల్లి రమేష్, గ్రంధి సత్యనారాయణ, సిజిఎఫ్ కమిటీ మెంబర్ కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

పేరుపాలెంసౌత్‌లో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి – మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంసౌత్‌లో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సచివాలయ భవనంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నేత్ర పరీక్షల్లో 42 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించినట్లు వైద్యులు సిహెచ్ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయలక్ష్మి, వాసు, ఎంపీ హెచ్ఎస్ ఎంవి.రామారావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సభలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి

ఆచంట నియోజకవర్గంలో రూ.1,26,100 నగదు సీజ్

ప్రజాశక్తి – ఆచంట

సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఆయా రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియ సక్రమంగా నిర్వహించడానికి ఎన్నికల యంత్రాంగానికి పూర్తిగా సహకారం అందించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామినాయుడు అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సభ్యులతో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం అన్ని రాజకీయ పార్టీల వారు బహిరంగ ప్రదేశాలలో సభలు, ర్యాలీల నిర్వహణకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ సంబంధించి 19 రకాల అనుమతులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందొచ్చని తెలిపారు. లేదా నేరుగా తమ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వివరించారు. ఏప్రిల్ 15వ తేదీ వరకూ కొత్త ఓటరు నమోదుకు అవకాశం ఉందని, కొత్త ఓటు నమోదుకు ఆయా రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలని కోరారు. ఆచంట నియోజకవర్గం సిద్ధాంతం జాతీయ రహదారిపై సోమ, మంగళవారాల్లో లెక్కలు చూపని రూ.1,26,100 నగదును సీజ్ చేశామని వెల్లడించారు. ఆచంట నియోజకవర్గంలో రామన్నపాలెం, ఆలమూరు, నత్తారామేశ్వరం, నెగ్గిపుడి గ్రామాల పరిధిలో మోడల్ కోడ్ సక్రమంగా అమలు జరగకపోవడంతో ఆయా పంచాయతీ కార్యదర్శిలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎన్నికల అధికారి వివరించారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఎటువంటి పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు అనుమతులు లేవన్నారు. ఈ సమావేశంలో ఎఆర్‌ఒలు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు), గణపతినీడి రామ్మోహన్ రావు, తలుపూరి బుల్లబ్బాయి, ఆచంట పోడూరు, పెనుమంత్ర, పెనుగొండ, ఎంపిడిఒలు ఆచంట పంచాయతీ కార్యదర్శి జిఎస్.నాగబాబు, మీడియా పాయింట్ ఇన్‌ఛార్జి నాగిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధునిపై ఆగంతుకుని దాడి

ప్రజాశక్తి – తణుకురూరల్

వృద్ధునిపై ఆగంతుకుడు దాడిచేసిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శీరామ్‌నగర్ 2వ లైన్‌కు చెందిన వృద్ధుడు పల్లపోతుల హరి మోహనరావు గతంలో ఆంధ్రా షుగర్స్ అనుబంధ సంస్థ అయిన గుంటూరులోని జోసిల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేశారు. తరువాత అక్కడ నుండి సొంత ఊరు ఏలూరు వచ్చి పెళ్లి సంబంధాలు కుదర్చడం మొదలు పెట్టారు. సోమవారం సాయంత్రం పెళ్లి సంబంధం కుదిర్చేందుకు ఏలూరు నుండి ఆర్‌టిసి బస్సులో ప్రయాణించి తణుకు బస్‌స్టేషన్‌లో దిగి అక్కడ నుండి బయటకు వచ్చి ఒక అపరచితుడిని పాలంగి గ్రామం ఎంత దూరం ఉంటుందని అడిగాడు. ఒంటరిగా రావడం గమనించి అపరిచితుడు తాను కూడా పాలంగి వైపు వెళుతున్నానని, మీరు నాతో రావచ్చని చెప్పి అతని బైక్‌పై తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అతను ఏం పని చేస్తున్నాడో తెలుసుకున్నాడు. మీరు వెళ్లేటప్పుడు తాను మిమ్మల్ని తీసుకుని మళ్లీ బస్‌స్టేషన్‌లో దింపుతానని నమ్మబలికాడు. తన దగ్గర రూ.10 లక్షల ఇచ్చే కొన్ని సంబంధాలు ఉన్నాయి. మీతో మాట్లాడాలని చెప్పి పాలంగిలో దింపి వెళ్లిపోయాడు. కొంత సమయానికి మరలా అక్కడ చేరుకుని అతనిని బైక్‌పై ఎక్కించుకుని తేతలి జాతీయ రహదారిలోని కొండాయపాలెం వెళ్లే రోడ్డులోనికి తీసుకెళ్లి తన మెడలో ఉన్న బంగారు గొలుసు ఇమ్మని చాకుతో బెదిరించాడు. దాంతో ఆ పెద్దాయన ఒక్కసారిగా అవాక్కయ్యాడు. ఏం మాట్లాడుతున్నావని బిగ్గరగా అరిచి తాను గొలుసు ఇవ్వనని చెప్పడంతో చాకు విసిరాడు. చేతిని అడ్డుగా పెట్టడంతో చేతికి బలమైన గాయమైంది. సుమారు అరగంట సేపు ఇద్దరి మధ్య పెనుగులాట సాగింది. పక్కనే ఉన్న చిన్న పంట కాలువలోకి పెద్దాయన పడిపోయాడు. అయినా ఆగకుండా ఆ అపరిచితుడు పెద్దాయనను రాళ్లతో కొట్టాడు. వాటిని ఎదుర్కొని పంట కాలువ దాటుకొని పంట పొలాల్లోకి పెద్దాయన వెళ్లిపోయాడు. కొండాయపాలెం ఊరిలో ఒక చర్చిలో సిలువ ధ్యాన కూడికలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ నుండి మైక్ ద్వారా వినబడుతున్న మాటాలను బట్టి రాత్రి 7.30 ప్రాంతంలో ప్రాణ భయంతో మోకాళ్ల లోతులో సుమారు కిలో మీటరు నడుచుకుంటూ ఆ చర్చి వద్దకు వెళ్లాడు. తీవ్ర రక్త స్రావంతో ఉన్న ఆయనను చూసిన వారు వెంటనే 108కి ఫోన్ చేసి, తణుకు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఎడమ చేతికి సుమారు 13 నుండి 15 కుట్లు వేశారు. విషయం తెలుసుకున్న వెంటనే తణుకు రూరల్ సిఐ జివివి నాగేశ్వరరావు, ఎస్‌ఐ కె.చంద్రశేఖర్, సిబ్బంది ఆసుపత్రికి చేరుకున్నారు. తణుకు రూరల్ స్టేషన్ ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండ్‌లో చోరీ

మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు

ప్రజాశక్తి – నరసాపురం

ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లో ప్రయాణికుల నుంచి డబ్బు, బంగారం, సెల్ ఫోన్లు దొంగలిస్తున్న మహిళను ప్రయాణికులు పట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం ఊరు వెళ్లేందుకు బస్‌స్టాండ్‌లో కూర్చున్న ప్రయాణికుల వద్ద నుంచి వెనుక ప్రయాణికురాలి వలే కూర్చుని ఓ మహిళ బ్యాగ్‌లో బంగారం దొంగతనం చేస్తున్న మహిళను స్థానిక ప్రయాణికులు పట్టుకున్నారు. ఆమెకు సహకరిస్తున్న మరో నలుగురు మహిళలను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. లక్ష్మణేశ్వరం, లిఖితపూడి గ్రామాలకు చెందిన మహిళల నుంచి రూ.4 వేలు, కీపాడ్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి : 9 మంది అరెస్టు

ప్రజాశక్తి – పాలకోడేరు

పాలకోడేరులో పేకాటాడుతున్న ఓ స్థావరంపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.38,080 స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం స్థానిక దేవాబత్తుల రాంబాబు బిల్డింగ్‌లో యూనియన్ అధ్యక్షులు బండి దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి దాన వరప్రసాద్ హాజరై మాట్లాడారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించడంలో వారిని గుర్తించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. వృత్తిదారుల ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరం విద్యుత్తు పరికరాలతో వృత్తిని కొనసాగిస్తూ జీవనం గడుపుతున్నారన్నారు. తక్షణం వృత్తిదారులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.